

ఒకటి....

రెండు....

మూడు....

—లిఫ్ట్ మూడో ఫ్లోర్‌లో ఆగింది. తలుపు రెండు చెక్కలుగా విచ్చుకొంటే, జుత్తును ఎగ దోసుకొంటూ, అలసట మొహంతో బయట పడింది సంధ్యారాణి. గబగబా అయిదారు అడుగుల్లో తన అపార్టుమెంటు దగ్గరికి చేరుకొంది. తాళం తీసి, వెళ్తూనే మంచంమ్మీద వెల్లకిలా పడింది. కళ్ళు మూసుకొని ఆలోచిస్తూంది.

చేతిన పుస్తకాలు చేతినే ఉన్నాయి. కాలిజోళ్లు కూడ విడవ లేదు. తెరిచిన తలుపు తెరిచినట్టే ఉంది.

బాధ పడుతూందామె.

ఆప్యాయంగా తనని దగ్గరగా తీసుకొని నుదుటను చేతితో నిమిరే భర్తను ఆమె కావాలనుకొందా క్షణం! కాళ్ళదగ్గర కూర్చుని, తనని ఆర్తంగా, ప్రేమగా చూసే పిల్లల్ని ఇద్దరంటే ఇద్దర్ని ఆమె కోరు కొందా క్షణం! అయితే ఆమె కావాలనుకొన్నదీ, కోరుకొన్నదీ లభించే అవకాశం ఉందా ?!

లేదుగాక లేదు !!

తెలిసీ, తెలియకా కేవలం ఒకానొక శబ్దంతో అటువంటి అనుభూతు లన్నిటినీ కాలదన్ను కొందామె. ఆ శబ్దాన్ని అలవాటుగా చేసుకొని వాటికి దూరమయింది. అప్రయత్నంగా నోటి వెంట వెలువడేది ఆ శబ్దం. ఆ శబ్దం ఆమె జీవితాన్ని మింగేస్తుందని, ఆమె ఆశల్ని అధః పతనం చేస్తుందని, కలల్ని కల్లలు చేస్తుందని ఊహించ లేక పోయింది. ఆ శబ్దం—

ష్!

—అందుకే నిద్రను కలలినా, ఇల్లి అదుపు విన్నా, క్షణంలో సగంలో ఫుక్కుర్ వెయిట్ తేస్తే వచ్చే 'ష్!' సంధ్యారాణిని భయపెడుతుంది. బాధిస్తుంది. ఏడిపిస్తుంది. ఆ శబ్దానికి దూరంగా ఉండాలను కొంటుందామె. కాని సాధ్యం కాదు. నేల నాలుగు చెరగులా అదే శబ్దం! నిశ్శబ్దంలో అదే శబ్దం! నిరాశలో అదే శబ్దం!

సంధ్యారాణికి గతాన్ని గుర్తుకు తెచ్చే శబ్దం అది.

సంధ్యారాణిని గేలి చేసే శబ్దం అది.

కొన్ని వందల పెదవులు కలుసు కొంటే, లేదా కొన్ని వేల పెదవులు వెనక్కి విరిగిపడితే వచ్చే ష్...ష్...ష్... శబ్దాలు ఆమెను వెక్కిరిస్తాయి. ఆమెను చిటుకున హూసీ చేస్తాయి.

ఆ నాటికి—

# ఆశలో..... ష్!

సంధ్యారాణి వయసు పద్దెనిమిది! కోల మొహంతో, అందమయిన కళ్ళతో ఆమె అందంగా, ఆనందంగా ఉన్న రోజులవి! డిగ్రీ చదువుతుండేది.

తల్లి లేదు.

తండ్రే, తల్లిలా ఆమెను పెంచి పెద్దదాన్ని చేశాడు. పెద్దగా ప్రాక్టీసు లేకపోయినా ఊరిలో పలుకుబడి ఉన్న డాక్టరాయన. సంధ్యారాణిని పల్లెత్తు మాట అనేవాడు కాడు. పైగా కూతురి దగ్గిర తన మాట పెరగడం లేదని బాధపడే వాడు కూడా కాదు.

ఆ దినాల్లోనే—

పంజాబీ డ్రస్‌లో, రెండు జెళ్ళతో, హై హీల్స్‌లో వయ్యారంగా నడిచే సంధ్యారాణిని చూసి క్లాస్‌మేట్ సత్తిబాబు ప్రేమలో పడ్డాడు. ఆమె చూపు కోసం, ఆమె ప్రాప్తు కోసం తాపత్రయ పడ్డాడు. ఆమె అడుగుల్లో నడిచేవాడు. ఆమె ఎక్కడ నిలిస్తే అక్కడ నిలిచేవాడు. అతని నోటు పుస్తకాల నిండా సంధ్యారాణే అందుకే—

"హలో' అని తెగించి పలకరించాడానాడు. ఆమె మాట్లాడలేదానాడు.

"ఈ గులాబీ మీ కోసం" అని తనని తాను అర్పించుకొన్నట్టుగా పువ్వును అందివ్వనుంటే, అందుకోలేదామె. పువ్వునే అందుకోనిది, చేతి నున్న ప్రేమ లేఖను అందిపుచ్చుకోదని తెలిసి.

ఆ లేఖను ఆమె కాళ్ళదరి విడచి వెనుతిరిగాడతను. అతన్ని చూస్తే ఓడిపోయిన మనిషి వర్షంలో తడుస్తూ ఒంటరిగా పోతున్న భావన కలిగింది. జాలివేసింది. తర్వాత ఏమనుకొందేమో ఆ ఉత్తరాన్ని తీసి చదివింది.

సంధ్యా!

నాకు ప్రేమ లేఖలు రాయడం చాతకాదు. అందుకని నాలుగే నాలుగు వాక్యాలు రాస్తున్నాను:

నిన్ను నేను ప్రేమిస్తున్నాను.
నన్ను ప్రేమించవూ!
నువ్వు కన్పించక పోతే నిలువలేను.
నువ్వు కాదంటే బతకలేను.

నీ
సత్తిబాబు

పదేపదే చదివిందదామె. పదిమంది ముందూ చదివింది. చదువుతూ పగలబడి నవ్వింది. సత్తిబాబును నవ్వుల పాలుజేసింది. అంత జరిగినా మనసు మారుతుమూల మరో ఆశతో— లంచ్ అవర్లో, కాలేజీ తోటలో కూనిరాగం తీస్తూ కూర్చొని ఉన్న సంధ్యారాణిని కలిసి సత్తిబాబు—


'మీ సమాధానం ఏమిటి' అనడిగి నప్పుడు, అప్పుడంటే అప్పుడు, తొలిసారిగా, నిర్లక్ష్యంగా పెదవి విప్పి, విరిచి—

'ప్చ్' అంది. ఆ దెబ్బకు సత్తిబాబు భగ్న ప్రేమికుడయి, బ్రతుకు భారమనుకొన్నాడేమో, బ్రతికి లాభం లేదనుకొన్నాడేమో ఊపిరాడని గదిలో ఉరిపోసుకొని చనిపోయాడు. అంతలో సంధ్యారాణి డిగ్రీ పూర్తయింది. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కి వెళ్ళింది.

చదివిన చదువుల్తో ఉద్యోగాలు చేయాలా? ఊళ్ళేలా? సంధ్యారాణిని ఓ ఇంటి దాన్ని చేయక తప్పదనిపించింది తండ్రికి. తను బ్రతికి ఉంటూండగానే కూతురి కళ్యాణం కళ్ళారా చూడాలని ఆశించాడు. అంతస్తుకి తగిన సంబంధం వెతికాడు. కుర్రాడు బాగుంటాడు. బొంబాయిలో ఉద్యోగం చేస్తున్నాడు. ఏదో కంపెనీలో కెమిస్ట్. పెళ్ళి చూపుల్ని ఏర్పాటు చేశాడు. వారం రోజుల ముందుగా ఆ విషయాన్ని కుర్రాడి వైపు వాళ్ళకి తెలియజేసి, కుర్రాణ్ణి వెంటబెట్టుకొని రమ్మనమన్నాడు. అదే విషయాన్ని కూతురికి కూడా వారం ముందుగా చెప్పాడు. వారమంతా చెప్పాడు.

జ్ఞాపకం ఉంటుంది డాడీ! ఇన్ని సార్లు చెప్పాలా" అంది సంధ్యారాణి.

'చెప్తూంది నీ కోసం కాదమ్మా నా కోసం! పది సార్లు తలచుకొంటే పది పనులు గుర్తు కొస్తాయి. పెళ్ళి చూపుల్లో ఏదీ తక్కువగా జరగ కూడదు' అన్నాడతను. తండ్రి మాటలకి నవ్వు



కొంది సంధ్యారాణి. అయితే రేపు చూపులనగా ముందు రోజు స్నేహితురాలి పెళ్ళికి తప్పని సరిగా ప్రక్క ఊరికి వెళ్లాల్సి వస్తే! వెళ్తు వెళ్తూ—

'ఎట్టి పరిస్థితుల్లోనూ పుదయం ఎనిమిదింటి కల్లా ఇంట్లో ఉంటాను డాడీ' అని వెళ్ళిపోయిం దామె.

"మరిచిపోకమ్మా" అన్నాడు తండ్రి. సరే నని తలూపింది. తరలిపోయింది. పెళ్ళింట ఆ రాత్రి, ఆ తెల్లార్లు కబుర్లు చెప్పుకొన్నారు స్నేహితురాళ్ళు. డిగ్రీ రోజుల్ని తలుచుకొన్నారు. ఎకనామిక్స్ లెక్చరర్ని, ఎకానమీగా, పొట్టిగా ఉండే అతని కోటునూ గుర్తు తెచ్చుకొన్నారు. సత్తిబాబును నెమరువేసుకొన్నారు. నవ్వుకొన్నారు. తెల తెల వారుతున్న వేళ నిద్రపోయారు. నిద్ర లేచేసరికి కిటికీ నుంచి పొద్దు మంటలా మొహాన్న కొట్టింది. గాబరా పడిందామె. కంగారుగా ఆ సాయంత్రానికి ఇంటికి చేరుకొంది.

తండ్రి సోఫాలో కూర్చొని ఉన్నాడు. ఎదురు చూడడం కాదు, ఎటో చూస్తూ కన్పించాడు.

"పెళ్ళయిందమ్మా" అనడిగాడు.

"బ్రహ్మాండంగా డాడీ పెళ్ళి కొడుకు ఎంత బాగున్నాడో' అంది.

"కాని పిల్ల వ్యవహారం నచ్చలేదని పెళ్ళి కొడుకు వెళ్ళిపోయాడమ్మా" అన్నాడు తండ్రి.

"డాడీ' ఆశ్చర్యపోయింది సంధ్యారాణి.

"పెళ్ళి చూపులకే లేని పిల్ల రేపు పెళ్ళయి స్థిరంగా ఉంటుందా? అని ప్రశ్నించాడమ్మా వేళ మించిపోయిందని వెళ్ళిపోయాడు. అతని కాళ్ళా వేళ్ళా పడ్డాను. అయినా...."

"డాడీ మీరంటున్నది...."

"నీ పెళ్ళి చూపుల సంగతి."

అప్పుడు—


రెండోసారి—

మరిచిపోయానన్నట్టుగా క్రింది పెదవిని లాగి వదిలిందామె.

ప్చ్!

కొద్ది రోజులకి తండ్రి చనిపోయాడు. బ్రతికి నన్నాళ్ళూ వచ్చీరాని రాబడితో మేడి పండులా బ్రతికాడే తప్ప ఇంటి దారిద్ర్యాన్ని ఇటు కూతురికి, అటు ఊరికి చూపలేదాయన. ఆ విషయం తండ్రి పోయాక తెలుసుకొంది సంధ్యారాణి. తర్వాత మరో విషయాన్ని కూడా గ్రహించగలిగింది. తనకి దిక్కు తనేనని.

పోస్టు గ్రాడ్యుయేషన్ మెల్లిగా అయిందనిపించింది. క్లాసు తెచ్చుకొంది. రెజ్యూల్లు ఖాళీగా ఉంది. తర్వాత లెక్చరర్ అయింది. ఆమె లెక్చరిస్తుంటే వింటున్నట్టు నిశ్శబ్దంగా కూర్చొనే వాళ్ళు స్టూడెంట్సు. అయితే వాళ్ళు లెక్చర్సు వినడం లేదని, తన నాభిని, నడుమునూ శ్రద్ధగా పరిశీలిస్తున్నారని చాలా రోజులదాకా తెలుసుకోలేక పోయింది.




అప్పటికి ఆమె వయసు ఇరవై నాలుగేళ్ళు. ఆటుకొమ్మా, పట్టుకొమ్మా లేదని అందరూ ఆకతాయితనంగా చూసేవారామెను. కొలీగ్స్ కళ్ళతో కబుర్లాడేవారు. స్టూడెంట్స్ 'మేడం' అనక 'మిస్' అనేవారు. తట్టుకోలేకపోయింది. తనకి తనే తోడు. ఇది తప్పనుకొంది. వేరొకర్ని తోడుగా కావాలనుకొంది. బుద్ధిమంతుడూ, యోగ్యుడూ అయిన తెలుగు లెక్చరర్ శర్మని గమనించింది. పెళ్ళికాలేదతనికి. సంబంధాలను బట్టి పెడుతూ స్టాఫ్‌కి దూరాన ఉన్న అతన్ని చూసి 'సేఫ్టీ' అని ఆశించింది. మొదటిసారిగా, కలుపుగోలుగా అతనితో పది నిముషాలు మాట్లాడింది. అతని ఇష్టాయిష్టాలు, అభిరుచులూ తెలుసుకొంది.

అతనికి నెమలికంఠం రంగు చీరంటే ఇష్టం.
కట్టుకొచ్చింది.
అతనికి సన్నజాజులంటే ఇష్టం!
పెట్టుకొచ్చింది.
భానుమతి పాటలంటే ఇష్టం!

అనుకరించి పాడి వినిపించింది. అయినా అతనిలో చలనంలేదు. ఇది సరికాదనుకొంది. అతన్ని ఇంటికి 'టీ'కని పిలిచి, దగ్గరగా తలని రెండు చేతులోనూ ముందుకు తమకంగా లాగి అతని పెదవుల్తో తన పెదవుల్ని కలిపింది.

ముచ్చటగా మరోసారి—
పెదవులు కలిస్తే వచ్చే శబ్దం—
ప్చ్!!

* * * *

అంతే అతను దిగున లేచి నిల్చున్నాడు. సంధ్యారాణిని కోపంతోను, అసహ్యంతోనూ చూశాడు. అపర ప్రవరాఖ్యుడిలా ముక్కుపుటా లెగరేసి..

'మీరిటువంటి వారని నాకు తెలీదు" అన్నాడు. చరచరా వెళ్ళిపోయాడు. తర్వాత ఆ విషయాన్ని అందరికీ చెప్పాడో లేక కొందరికి చెబితే అందరికీ తెలిసిందో తెలియదుగాని "సంధ్యారాణి పెద్దకేసు" అని టాం టాం అయింది. దాంతో కాలేజీలో ఓ సంవత్సరంపాటు ఆమె తలెత్తుకు తిరగలేకపోయింది. ఆ సంవత్సర కాలం ఆమె చాలా రాత్రుళ్ళు, చాలా పగళ్ళు నిరాశతో, నిస్పృహతో—

మరోసారి—
చాలాసార్లు—
నిట్టూర్చింది—
ప్చ్ !!!

ఇప్పుడు సంధ్యారాణికి ముప్పై ఆరేళ్లు. పెళ్ళి చేసుకొని ఓ ఇంటిది కాకపోయినా కూడబెట్టిన డబ్బుతోనూ, కొంత అప్పుతోనూ ఓ అపార్ట్‌మెంట్ కొనుక్కొని ఆ విధంగా ఓ యింటిదయింది. ఆమెకు సరదాలు లేవు. సంతోషాలు లేవు. నవ్విస్తే నవ్వుతుంది. ఏడిపించినా నవ్వుతుంది నవ్వును అలవాటు చేసుకొందంతే. అందువల్ల స్టూడెంట్సు ఆమెను 'మేడం' అంటున్నారు.

"మేడం."

—లైబ్రరీలో కూర్చొని ఆ రోజు పేపరు చదువుతూన్న సంధ్యారాణి ఆ పిలుపుకి తలెత్తి చూసింది. ఎదురుగా కుమార్ నిల్చునివున్నాడు. పద్దెనిమిదేళ్ళ పొంకంతో మెరుస్తూ, దిక్కులు చూస్తున్నాడు. డిగ్రీ ఫస్ట్ ఇయర్ స్టూడెంటతను.

"ఎస్" అంది. కుమార్ చుట్టు పక్కల గమనించి చూశాడు. ఏకాంతమనుకొని, కొంచెం ముందుకు వంగి—

"ఐ లైక్ యూ ఐ లవ్ యూ" అన్నాడు. అలా అంటున్నప్పుడు ఆ కుర్రాడి గొంతు చాలా చీలికలయింది. అయితే అతని కళ్ళలో నిజాయితీ కన్పించింది.

"మీరు ఒప్పుకుంటే పెళ్ళి చేసుకొంటాను" అన్నాడు.

అప్పుడు—
ఇంకోసారి—
జాలిగా పెదవుల్ని చప్పరించింది.
ప్చ్ !!
—లేవి అరచేత్తో అతని బుగ్గని నిమిరింది.
"పూర్ బేబీ" అని బుగ్గ గిల్లింది.

"అమ్మను పెళ్ళిచేసుకొంటారా' అనడిగింది. పరుగులాంటి నడకతో అతని ముందు నుండి కదిలొచ్చేసింది.

కుమార్ ఎందుకలా అడిగాడో!
నిజంగా ప్రేమిస్తున్నాడా?
పెళ్ళి చేసుకుంటాడా?
—ఆలోచించలేకపోతుంది. సంధ్యారాణి.

ప్చ్! ప్చ్!! ప్చ్!!! •